క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గంగడిపాలెం, పోటుమెరక, బొబ్బర్లంక, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, చోడాయపాలెం, కైతేపల్లి, తుమ్మల, నిర్మలనగర్, మోళ్ళగుంట, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.6 లక్షల నగదు చెక్కు అందజేత



రేపల్లె రూరల్: పట్టణంలోని 28వ వార్డుకు చెందిన హేమ నాగశ్రీ వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6 లక్షల నగదు చెక్కును రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం టీడీపీ నాయకుడు అనగాని శివ ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, జీపీ రామారావు, నర్రా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



గణపవరం(కర్లపాలెం): ఆపదలో ఉన్న అభాగ్యులకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి చేయూతనందించాలని ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి పేర్కొన్నారు. గణపవరం దేవుడి మాణ్యం కాలనీలో పక్షవాతం వచ్చి కదలలేని స్థితిలో ఉన్న బాలుడి కుటుంబానికి రూ. 5 వేలు బాపట్ల ఆదర్శ ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు బుధవారం అందజేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు శ్రీరామ్ సునీల్, గోపి, అశోక్‌కుమార్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, అంకమరావు, రాజారమేష్, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రజా ఉద్యమాల్లో బెజ్జం పాత్ర కీలకం



బాపట్ల: ప్రజా ఉద్యమాల్లో బెజ్జం శ్రీనివాసరావు పాత్ర ఎంతో కీలకమని న్యూ డెమోక్రసీ నాయకుడు మేకల ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శిగా పని చేసిన బెజ్జం శ్రీనివాసరావు 6వ వర్ధంతి సభ స్థానిక కొల్లా వెంకయ్య కాలనీలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బెజ్జం శ్రీనివాసరావు ఉద్యమానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నివాళి అర్పించిన వారిలో ఎన్.విష్ణు, మువ్వల రాఘవులు, పల్లవి, ఎంపీ రంజాన్ ఉన్నారు.

బియ్యం, నూనె వితరణ



చెరుకుపల్లి: హిందూ ముస్లిం ఒక్కటే అని గుళ్లపల్లి గ్రామానికి చెందిన ముస్లింలు మరోసారి రుజువు చేశారు. గ్రామంలో అయ్యప్పలు, భవాని దీక్ష మాలధారులకు గుళ్లపల్లి నాగ్ యూత్ కమిటీ, అనగాని యువ సేన ఏర్పాటు చేసిన 40 రోజుల సద్ది కార్యక్రమానికి మీర్జా అజముద్దీన్ 50 కేజీల బియ్యం, 15 కేజీల నూనె డబ్బా బహూకరించారు. షాజాద్, బాజి, రఫీ, కాటూరి ఏడుకొండలు, వంగర శ్రీనివాసరావు, వంగర చక్రవర్తి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

భట్టిప్రోలు: నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తర్వాత మండలంలో విచ్చల విడిగా, బహిరంగంగా బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. 5 మద్యం దుకాణాలకు అనుమతులు లభించాయి. ఈ అమ్మకాలను కూటమి పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు ధీమాగా నిర్వహిస్తున్నారు. ఐలవరం, భట్టిప్రోలు, వెల్లటూరు, పెదపులివర్రు, గొరిగపూడి, ఓలేరు, చింతమోటు, పల్లెకోన గ్రామాల్లో ఈ బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. ఈవిషయమై రేపల్లె ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఆర్.దివాకర్‌ను వివరణ కోరగా గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణపై నిఘా పెట్టినట్లు తెలిపారు. అక్రమంగా ఎవరైన మద్యం విక్రయాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సీఛీ రోడ్లు..

- గ్రామాల్లో కాల్వలను తలపిస్తున్న సీసీ రోడ్లు
- వర్షాలతో రోడ్లపైకి చేరుతున్న మురుగు
- పారుదల మార్గం లేక గుడిసెల్లోకి చేరుతున్న వైనం
- ఓ వైపు దుర్గంధం, మరోవైపు దోమల బెడద



రామకృష్ణ నగర్ అపార్ట్‌మెంట్ వద్ద నిలచిన మురుగు

చెరుకుపల్లి: ఇటీవల మండలంలో వర్షాలు కురిశాయి. పలు గ్రామాల్లోని సీసీ రోడ్లు నీరు చేరి కాల్వలను తలపిస్తున్నాయి. నిల్వ నీటితో మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. గుళ్లపల్లి, చెరుకుపల్లి జంట గ్రామాల్లో మురుగు నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- గుళ్ళపల్లి మదీన మసీద్ ముందు సీసీ రోడ్డుపై గత 20 రోజులుగా వర్షపు నీరు నిలిచిపోయింది. అదే గ్రామంలోని బూరలమ్మ డొంకలో కూడా వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక సీసీ రోడ్డుపై నిల్వ ఉంది. రోడ్డు పక్కనే ఉన్న గుడిశల్లోకి వరద నీరు చేరుతోంది. దీంతో గుడిశల్లో నివశిస్తున్న ఎస్టీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోయి దుర్వాసన, మరో పక్క దోమలు, దీనికి తోడు పాముల బెడదతో నానా ఇబ్బందులు పడుతున్నామని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- చెరుకుపల్లి రామకృష్ణ నగర్‌లోని సంపత్ బాబు అపార్ట్‌మెంట్ సమీపంలోని మురుగు నీటి కాల్వ పొంగుతోంది. దీనికి తోడు నాయీ బ్రాహ్మణ కాలనీకి వెళ్లే మార్గంలో ఆర్టీసీకి కేటాయించిన ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీనికితోడు వర్షపు నీరు చేరి, సుమారు రెండు అడుగుల లోతులో మురుగు నెలలు తరబడి దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడంతా దోమల బెడద అధికంగా ఉందని నివాసితులు చెబుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- మురుగు బయటకు పోక పోవడంతో నాయీబ్రాహ్మణ కాలనీ, ఎస్సీ కాలనీల్లోని సెప్టిక్ ట్యాంకులు నిండిపోతున్నాయని, దీంతో నానా ఇబ్బందులు పడున్నమని స్థానికులు చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం పంచాయతీ సిబ్బంది ఇంజిన్ ద్వారా నీరు తొలగించారు. అయినా మురుగు తరగలేదని వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు, అపార్ట్‌మెంటు యాజమాన్యం చొరవ తీసుకుని నివాస ప్రాంతంలో నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించాలని కోరుతున్నారు. గుళ్ళపల్లి పంచాయతీ కార్యదర్శి మురళీని వివరణ కోరగా సాధ్యమైనంత త్వరగా మురుగు నీటిని తొలగించి పారిశుద్ధ్య మెరుగుపరుస్తామన్నారు.



గుళ్లపల్లి మదీనా మసీద్ ముందు మడుగులా సీసీ రోడ్డు



చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వెనుక ఇలా..

ఎలుకల నివారణపై దృష్టి సారించాలి



రేపల్లెలో ఎలుకల మందు తయారీపై ఏడీఏ శ్రీనివాసరావు అవగాహన



కొల్లూరులో మందును పొలంలో పెట్టిస్తున్న అధికారులు



కావూరులో ఎలుకల మందు తయారీ

రేపల్లె రూరల్: సాగులో రైతులు ఎలుకలతో కొంత నష్టపోతున్నారని మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు అన్నారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బేతపూడి, ఉప్పూడి, కామరాజు గడ్డ సచివాలయ కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఎలుకల మందు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. యాంత్రిక పద్ధతుల్లో భాగంగా పొలాల్లో ఎలుక బోనులు, బుట్టలు ఉపయోగించి పైరు తొలిదశలోనే ఎలుకలను నియంత్రించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఆర్.విజయ్‌బాబు, పంచాయతీ సెక్రటరీలు డి.పుష్పకుమారి, సీహెచ్ అనూష, వీఆర్‌వో వెంకటేశ్వర్లు, వీఏఏలు రాయల్‌బాబు, ప్రసాద్, హిమబిందు, ఆషా, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు. మోళ్ళగుంట, తుమ్మల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ విజయబాబు నిర్వహించారు.

కొల్లూరు: బాపట్ల డీఆర్‌సీ ఏడీఏ హుసేన్ బుధవారం కొల్లూరులో సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు మందు కలిపిన ఎరువును ఉచితంగా అందజేశారు. ఏఓ ఆర్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: అద్దంకి వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.ధనరాజు బుధవారం కావూరు, ఆరుంబాక గ్రామాల్లో ఎలుకల నివారణ మందు తయారీ విధానాన్ని పరిశీలించారు. రైతలకు మందును పంపిణీ చేశారు. ఏఓ టి.బాలాజీ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు: వరి పంటలో ఎలుకల నివారణకు సామూహికంగా చర్యలు చేపట్టాలని డీపీఎం వాణిశ్రీ, పేర్కొన్నారు. మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల్లో బుధవారం సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. ఓలేరులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ టి.ఉదయ భాస్కరి పాల్గొన్నారు. ఏఓ జి. మీరయ్య, సర్పంచ్ రంగారావు పాల్గొన్నారు. భట్టిప్రోలులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, వీఏఏ మైత్రేయి, కరుణ శ్రీనివాసరావు, చెన్నయ్య పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): వరి పైరులో తెగుళ్ల నివారణకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ ఎం.మోహనరావు తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సామూహిక ఎలుకల నివారణకు మందులు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి అదంబాబు, రైతులు పాల్గొన్నారు.

వేమూరు: మండలంలోని చంపాడు గ్రామంలో ఎలుకల నివారణ మందును జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడీఏ జీబీపీ ప్రవీణ్ బుధవారం పంపిణీ చేశారు. ఏఓ చందోలు సునీత పాల్గొన్నారు.

వేమూరు(అమర్తలూరు): అమర్తలూరు మండలంలోని ఇంటూరు, యలవర్రు, తురుమిళ్ల గ్రామాల్లో ఎలుకల మందు పంపిణీ చేశారు. మండల మానిటరింగ్ అధికారి నాగేశ్వరరావు పాల్గొని, మందును రైతులకు అందజేశారు. ఏఓ లోకేశ్వరి, వ్యవసాయ విస్తరణ అధికారులు టి.శ్రీ క్రాంత్, కె.లక్ష్మీ ప్రసన్న రైతులు పాల్గొన్నారు.

కర్లపాలెం: మండల పరిధిలో బుధవారం జరిగిన ఎలుకల మందు పంపిణీ కార్యక్రమాన్ని ఏవో సుమంత్‌కుమార్ పర్యవేక్షించారు. దుండివారిపాలెం, కర్లపాలెం గ్రామాలలో జరిగిన మందు పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లో బుధవారం ఎలుకల నివారణకు మందు పంపిణీ చేసినట్లు వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు



పోతుమర్రు గ్రామ సభలో ఆర్డీఓ రామలక్ష్మి

వేమూరు: భూ రీ–సర్వేలో సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రేపల్లె ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి అన్నారు. మండలంలోని పోతుమర్రు గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వంలో కొన్ని గ్రామాల్లో రైతుల పొలాలు రీ–సర్వే చేసినట్లు చెప్పారు. అందులో సవరణకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రీ సర్వేలో రైతుల సమస్యలు వెంటనే పరిష్కారించడం జరుగుతుందన్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, అమర్తలూరు, కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు హాజరయ్యారు. తహసీల్దారు సుశీల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బలవంతంగా చిరు వ్యాపారుల తరలింపు



చిరువ్యాపారులను పంపేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బాపట్ల: బాపట్ల పట్టణంలోని మార్కెట్ వద్ద ఉన్న చిరు వ్యాపారులను మున్సిపల్ అధికారులు తొలగించారు. కూరగాయాల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన రైతుల బజారులోనే కూరగాయాలు విక్రయాలు చేయాలంటూ డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, శానిటరీ సిబ్బంది మార్కెట్ వద్ద ఉన్న తోపుడు బండ్లను తొలగించే పనులు చేపట్టారు. ఎప్పటి నుంచో మార్కెట్ వద్ద తోపుడు బండ్లు, నేల మీద కూర్చొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను అన్యాయంగా తొలగించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజారులో మాత్రమే అమ్మకాలు చేసుకోవాలని అధికారులు సూచించడం సరికాదని చిరు వ్యాపారులు చెబుతున్నప్పటికి వారిన్ని బలవంతంగా తరలించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు



బాపట్ల: కార్తీక మాసంలో సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు కోరారు. సూర్యలంక సముద్ర తీరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కార్తీక మాసంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి సూచించారు.

విధి నిర్వహణలో లోపాలు ఉండకూడదు



తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. మారీసుపేటలోని శానిటేషన్ డివిజన్ కార్యాలయాన్ని బుధవారం తెల్లవారుజామున ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు సకాలంలో హాజరుకావాలని సూచించారు. అలాగే చెత్త సేకరణను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం 23, 24, 32 వార్డుల్లో పర్యటించారు. ఆయా వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ శానిటేషన్ సెక్రెటరీలు ఉన్నారు.

బంకుల్లో కనీస వసతులు మృగ్యం



వెల్లటూరులోని పెట్రోల్ బంక్



బంక్‌లో అపరిశుభ్రంగా ఉన్న వాటర్ కూలర్



అపరిశుభ్రంగా వాష్‌రూమ్

భట్టిప్రోలు: అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పెట్రోల్ బంక్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో బంక్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పెట్రోల్ బంక్‌ల్లో స్వచ్ఛమైన తాగు నీటి సదుపాయాన్ని కల్పించాలి. ఇందుకోసం పెట్రోల్ పంప్ డీలర్ ఆర్వో మిషన్, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్‌ను ఏర్పాటు చేయాలి. అలాగే పరిశుభ్రమైన మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలి. అంతేకాక స్త్రీ, పురుషులకు విడివిడిగా వాష్‌రూమ్స్ ఉండాలి. ప్రతి పెట్రోల్ పంప్ వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ విధిగా కల్పించాలి. సౌకర్యాలతో పాటు వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ నాణ్యత, పరిమాణాన్ని తెలుసుకునే హక్కు కూడా ఉంది. టైర్లలో గాలి నింపడానికి బంక్‌ల వద్ద ఎయిర్ మిషన్ తప్పని సరిగా ఉండాలి. ఇందుకోసం ఎలక్ట్రానిక్ యంత్రాన్ని, గాలిని నింపడానికి ప్రత్యేకంగా ఒక వ్యక్తిని ఏర్పాటు చేయాలి. కానీ, ఇవేవీ భట్టిప్రోలులో కన్పించడం లేదు. ఫిర్యాదులు వేసేందుకు పెట్టెలు కూడా ఉండరు. ఈ పరిస్థితి భట్టిప్రోలు మండలంలోని కొన్ని పెట్రోల్ బంక్‌ల్లో నెలకొంది. పెట్రోల్ బంక్‌ల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉంది.

హత్యలు, అత్యాచారాలు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

చేబ్రోలు: మహిళలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు అరికట్టడంలో టీడీపీ ప్రభుత్వం తగిన శ్రద్ధ వహించడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ విమర్శించారు. తెనాలికి చెందిన సహానాను చంపిన నవీన్‌ను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాత్రి స్థానిక కచేరి సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడుల్ని అరికట్టడంలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం అవుతున్నాయని తెలిపారు. నిందితులు అధికార పార్టీ అండతో సులభంగా తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను శిక్షించడంలో ప్రభుత్వం అవలంబిస్తున్న సాచివేత ధోరణి సరైంది కాదని ఖండించారు. మహిళలపై దాడులు జరుగుతున్నప్పుడు వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టడంలో లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు రాఘవమ్మ, మండల కార్యదర్శి హనుమంతరావు, శారద, దీపిక పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన



విద్యార్థులకు వివరిస్తున్న పోలీసు సిబ్బంది

వేమూరు: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని విద్యార్థులకు ఎస్ఐ రవి కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో పోలీసుల సంస్మరణ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర గురించి విద్యార్థులకు ఎస్ఐ స్క్రీన్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలీసుల విధులను వివరించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 34 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బుధవారం గుంటూరు కమాండింగ్ ఆఫీసర్ సుదర్శన్ ఏ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం. ఎం ఏడుకొండలు ఎంఈవోలు ఏహెచ్‌వీ ప్రసాద్, రాయల సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడానికి ఎన్‌సీసీ ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఉన్నత విద్యలో ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని, దేశ రక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్‌సీసీ టీచర్ దుర్గాబాయి, ఉపాధ్యాయిని ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

అవగాహన, అప్రమత్తతతోనే క్యాన్సర్ నిర్మూలన

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్ వేదికపై యడ్లపాటి అశోక్ కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్ : అవగాహన, అప్రమత్తతోనే క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్ సమావేశ మందిరంలో బుధవారం సత్కార సభ నిర్వహించారు. క్యాన్సర్ రోగులకు అంకితభావంతో సేవలందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, నాట్కో క్యాన్సర్ సెంటర్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ టీవీ శివరామకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఏ జాహ్నవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్. మురళి, డాక్టర్ టి. వెంకట్‌రెడ్డి, డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయకుమారిలను ఘనంగా సత్కరించారు. సభలో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీవన శైలిలో మార్పు ద్వారానే క్యాన్సర్ అరికట్టగలమని పేర్కొన్నారు. గోల్డెన్ అవర్‌లో వైద్యం అందిస్తే ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. క్యాన్సర్ రోగులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పూర్తిస్థాయిలో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అన్ని రకాల పరీక్షలు, శస్త్ర చికిత్సలు, మందులు, పేషెంట్‌తో పాటు సహాయకులకు భోజన సదుపాయాలను అందిస్తున్నట్లు తెలిపారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ రేడియో థెరపీ విభాగాధిపతి డాక్టర్ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ఆలోచన వేదిక వంటి స్వచ్ఛంద సంస్థల గుర్తింపు ద్వారా తమపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. నాట్కో కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ త్వరలో రూ. 20 కోట్ల వ్యయంతో మరొక 150 పడకల అదనపు భవన నిర్మాణం నవంబరు నెలలో ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవల మీద గౌరవం పెరిగేలా నాట్కో క్యాన్సర్ ఆసుపత్రిలో తన భార్యకు గత ఐదు నెలలుగా చేస్తున్న చికిత్సలకు గుర్తుగా వైద్యులను, నర్సింగ్ సూపరింటెండెంట్‌లను సత్కరించడం సామాజిక బాధ్యతగా భావించినట్లు వివరించారు. సందర్భంగా సమాజ సేవకుడు వల్లూరు సదాశివరావు నాట్కో క్యాన్సర్ ఆసుపత్రికి రూ. 50 వేలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో చలపతి ఫార్మా కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ రామారావు, డైటీషియన్ పీరూ సాహెబ్, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. చంద్రశేఖరరావు, నర్సింగ్ సిబ్బంది, రోగుల సహాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన సదస్సు

రేపల్లె రూరల్: పోస్టల్ శాఖ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె సబ్ డివిజన్ పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.ఏడుకొండలు కోరారు. పోస్టల్ పథకాలపై పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయ ఆవరణలో ప్రజలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకింగ్ సేవలతో పాటు సమాచార వ్యవస్థ సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తత అవసరం

జీజీపాలెం(కాకుమాను): పత్తి రైతులంతా గులాబీ రంగు పురుగు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ బి.సుధారాణి సూచించారు. పెదనందిపాడు మండలంలోని జీజీపాలెం, అబ్బినేనిగుంటపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటపై గులాబీ రంగు పురుగు కనిపించిన వెంటనే నివారణకు పసుపు, నీలం రంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రబీ సీజన్‌లో శనగ, మొక్కజొన్న సాగుకు సిద్ధపడుతున్న రైతులకు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డాక్టర్ స్వాతి, వీఏఏలు పవన్ కుమార్,సుజాత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాకుమాను మండలంలో..

మండలంలోని బోడిపాలెం, కోతివానిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ కిరణ్మయి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటపై దోమ ఆశిస్తుందన్నారు. నివారణకు ఎకరాకు ఇమిడా క్లోప్రిడ్ 200 లీటర్ల మందును నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.